క్లుప్తంగా

పారిశ్రామిక ఫీడర్ నుంచి నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కపిలేశ్వరపురం: మండల పరిధిలోని అంగర విద్యుత్ సబ్ స్టేషన్‌లోని ఇండస్ట్రియల్ ఫీడర్ నుంచి ఆదివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు రామచంద్రపురం డివిజన్ ఈఈ విజయానంద్ శనివారం తెలిపారు. ఫీడర్ పరిధిలోని అంగర, టీకే, మాచర, వెదురుమూడి, నల్లూరు గ్రామాల్లోని పారిశ్రామిక సంస్థలకు సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. లైన్ల నిర్వహణ నిమిత్తం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకూ రైసుమిల్లులు, ఆక్వా చెరువులకు సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు.

శిశువు ఆరోగ్య పరిరక్షణకు పాటుపడాలి



పడమర ఖండ్రిక అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న మల్లికార్జునుడు

కపిలేశ్వరపురం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా శిశువుల ఆరోగ్య పరిరక్షణకు కార్యకర్తలు, ఆయాలు కృషి చేయాలని అంగర పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ జిత్తుక మల్లికార్జునుడు అన్నారు. మండలంలోని పడమర ఖండ్రిక గ్రామంలోని 37 నంబర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో కేంద్రాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

అర్హులను వివిధ శాఖల్లో నియమించాలి

రామచంద్రపురం: ఎంటెక్, బీటెక్ వంటి టెక్నికల్ క్వాలిఫికేషన్ ఉన్న తమను ప్రభుత్వంలోని 35 శాఖల్లో జూనియర్ అసిస్టెంట్లు నియమించాలని రామచంద్రపురం మండలంలోని పంచాయతీ సెక్రటరీ గ్రేడ్–6 (డిజి టల్ అసిస్టెంట్) ఉద్యోగులు రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని మంత్రి ఇంటి వద్ద డిజిటల్ అసిస్టెంట్లు శనివారం మంత్రి సుభాష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందించి తమ సమస్యలను వివరించారు. మంత్రి సుభాష్ సానుకూలంగా స్పందిస్తూ అసెంబ్లీ సమావేశాలు పూర్తయిన తర్వాత నియోజకవర్గం మొత్తం డిజిటల్ అసిస్టెంట్లతో రివ్యూ మీటింగ్ పెట్టి మాట్లాడతానని చెప్పారు.

మంత్రిని కలిసిన జేఏసీ నేతలు

రామచంద్రపురం: రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ని రామచంద్రపురం ఉద్యోగ జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడు మాధవరపు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఈ మేరకు ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చినట్లు వారు తెలిపారు. ఈకార్యక్రమంలో వీఆర్వోల సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి మద్దాల బాపూజీ, ఎన్జీవో ప్రెసిడెంట్ చిక్కాల సూర్యారావు, సహాధ్యాక్షుడు కె.సూర్యకుమారి, ఉపాధ్యాక్షుడు ఎంవీసుబ్రహ్మణ్యం, జాయింట్ సెక్రటరీ ఎం.కాశీ విశ్వేశ్వరరావు కోశాధికరి ఈవీవీ త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు

కొత్తపేట: మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దేవదాయ ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, దేవస్థానం ఈఓ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో స్వామివారి పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు ప్రత్యక్షంగా, పరోక్షంగా తైలాభిషేకాలు, పూజలు ద్వారా దేవస్థానానికి రూ 1,75,015, అన్నప్రసాదం విరాళాలు రూపంలో రూ.51,000 తో కలిపి మొత్తం రూ.2,26,015 ఆదాయం వచ్చినట్టు ఏసీ అండ్ ఈఓ విజయలక్ష్మి తెలిపారు. కడపకు చెందిన భక్తుడు సాయిథ సుబ్రహ్మణ్యం అన్నప్రసాద పథకానికి రూ 5,116 విరాళంగా అందజేసినట్టు తెలిపారు. దాతకు పండితులు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

బ్రాహ్మణ సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

కొత్తపేట: స్థానిక బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం స్థానిక బ్రాహ్మణ సంఘ కల్యాణమండపంలో బ్రాహ్మణ సంఘం సర్వసభ్య సమావేశం మాజీ అధ్యక్షుడు కీర్తి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వివిధ అంశాలు చర్చించారు. పలు తీర్మానాలు చేశారు. అనంతరం సంఘ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. అధ్యక్షుడిగా దెందులూరి జగదీశ్వరప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా అజ్జరపు వెంకటసుబ్బారావు, కోశాధికారిగా కీర్తి వీరవెంకటసత్యనారాయణమూర్తి, ఉపాధ్యక్షుడిగా వేమవరపు రామకృష్ణ, సహాయ కార్యదర్శిగా చావలి సుబ్బరాయశాస్త్రి, కార్యవర్గ సభ్యులుగా కందుకూరి మురళీధర్, సత్యవాడ సందీప్, ఆచంట విద్యాసాగర్, తణికెళ్ల శాస్త్రి, పట్టమట్ట రవి, కడియాల వీర వెంకటసత్యనారాయణరావు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని సభ్యులు పూలమాలలతో అభినందించారు. పూర్వ కార్యవర్గ సభ్యులు ముసునూరి వెంకటేశ్వరరావు, కాకరపర్తి బంగారుబాబు, వేమవరపు మురళి, కొపెల్ల శర్మ, అయ్యగారి కృష్ణ, నడిమింటి కృష్ణారావు తదతరులు పాల్గొన్నారు.

హుషారుగా.. సాగుతూ..

- ఊరటనిస్తున్న వర్షాలు
- చురుగ్గా వరినాట్లు
- నియోజకవర్గంలో 62 శాతం పూర్తి



వరినాట్లు వేస్తున్న కూలీలు

రామచంద్రపురం రూరల్: వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్ వరినాట్లు జోరందుకున్నాయి. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటి వరకు రామచంద్రపురం నియోజకవర్గంలో సుమారుగా 62 శాతం నాట్లు పూర్తి కాగా మండపేట నియోజకవర్గంలో 80 శాతం వరకు పూర్తి చేసినట్టు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఏటా ఖరీఫ్‌లో రామచంద్రపురం నియోజకవర్గంలోని కాజులూరు, రామచంద్రపురం, కె.గంగవరం మండలాల పరిధిలో 51,920 ఎకరాలు, మండపేట నియోజకవర్గంలోని మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల పరిధిలో 48,500 ఎకరాల్లోను వరిసాగు చేస్తుంటారు. సాధారణంగా జూన్ మొదటి వారం నుంచి ఖరీఫ్ పనులు మొదలై పోతాయి. జూన్‌లో నారుమడులు పూర్తి చేసుకుని జూలై రెండో వారం నాటికి నాట్లు పూర్తి చేస్తుంటారు. ఖరీఫ్‌లో 70శాతం వరకు నాట్లు వేస్తుంటే మిగిలిన 25 శాతం ఎదజల్లే విధానంలో సాగుచేస్తుంటారు.

నీరు సమృద్ధిగా ఉండడంతో..

వర్షాభావ ప్రభావంతో పంట చేలలో నీళ్ల లేక నాట్లు వేసినా గానీ నారు రావడం ఆలస్యం కావడంతో ఊడుపులు మొదట్లో మందకొడిగా సాగాయి. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతుకు కాస్త ఊరట నిచ్చాయి. రామచంద్రపురం నియోజకవర్గంలో 62 శాతం మండపేట నియోజకవర్గంలో 80శాతం పైగా నాట్లు పూర్తి చేశారు. ఉదాహరణకు రామచంద్రపురం మండలంలో 18,130 ఎకరాలు వరిసాగు చేస్తుండగా వర్షాలు కురిసి చేలలో నీరు సమృద్ధిగా ఉండడంతో ఇప్పటివరకూ 9250 ఎకరాల్లో నాట్లు వేయగా 3200 ఎకరాల్లో ఎదజల్లే పద్ధతిలో సాగు చేస్తున్నారు. మండపేట నియోజకవర్గంలో 60 శాతం ఊడ్పులు ఊడుస్తుంటే 30 శాతం ఎదజల్లుతున్నారు. ఈ సారి జూలై నెలాఖరు నాటికి నాట్లు పూర్తయ్యే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఈ మేరకు నాట్ల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతుల పొలాలకు వెళ్లి పలు సూచనలు ఇస్తున్నారు.

నెలాఖరుకు నాట్లు పూర్తి



"వర్షాలు కురవడంతో పంట పొలాల్లో నీరుచేరుతోంది. గత వారం రోజులుగా వర్షం పడుతుండడంతో రైతులు నాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు. నాట్ల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరిస్తున్నాం. ఈ నెలాఖరు నాటికి ఖరీఫ్‌లో నాట్లు వేసే కార్యక్రమం పూర్తవుతుంది."

– ఎస్ సత్యప్రసాద్, మండల వ్యవసాయాధికారి

మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



దుగ్గుదుర్రులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మాధవి

కాజులూరు: ప్రభుత్వాలు కల్పించిన చట్టాలపై బాలికలు, మహిళలు, ప్రజలు అవగాహన పెంచుకోవాలని తాళ్లరేవు ఐసీడీఎస్ సీడీపీఓ మాధవి అన్నారు. దుగ్గుదుర్రులో సెక్టారు సూపర్‌వైజర్ పీవీ కల్యాణి ఆధ్వర్యంలో శనివారం గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించి బాలికలు, మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాధవి మాట్లాడుతూ అనుమతి లేకుండా బాలికలపై ఎవరు చేతులు వేసినా, అభ్యంతరకరంగా ప్రవర్తించినా అది నేరమే అవుతుందన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై బాలికలకు అవగాహన కల్పించారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. సెక్టారు పరిధిలోని అంగన్‌వాడీ సిబ్బంది, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

వల్లూరులో ఉచిత వైద్య శిబిరం

కపిలేశ్వరపురం: కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్, గూడూరి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం మండలంలోని వల్లూరులో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆ గ్రామంలోని కాకతీయ కమ్యూనిటీ కిచెన్ ఆవరణలో బొల్లినేని, కిమ్స్ ఆసుపత్రుల సౌజన్యంతో నిర్వహించిన శిబిరాన్ని పారిశ్రామికవేత్త వంటిపల్లి పాపారావు ప్రారంభించారు. గ్రామస్తులకు వివిధ రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. మెరుగైన పరీక్షలు అవసరమైన వారికి సంబంధిత ఆసుపత్రుల్లో పరీక్షలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కమ్మ సంఘం నాయకులు నెక్కంటి శ్రీరాంజీ, పుట్టా సత్యనారాయణ, గజ్జరపు కల్యాణ్, గెడ శ్రీనివాస్, కాకతీయ కమ్యూనిటీ కిచెన్ నాయకులు గూడూరు సత్యనారాయణ, కమ్మ బ్రహ్మాజీ, శివశంకర్, చావ వినయ్ పాల్గొన్నారు.

నియోజకవర్గం అభివృద్ధికి అందరూ కృషి చేయాలి



మంత్రి సుభాష్, ఎంపీ బోస్‌లను సత్కరిస్తున్న తాగ్యరాజ ట్రస్టు సభ్యులు తదితరులు

ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్

రామచంద్రపురం: ఎవరు ఏ పార్టీకి చెందినా వారైనా, రాజకీయాలు ఎన్నికల వరకే ఉండాలని, రామచంద్రపురం నియోజకవర్గం అభివృద్ధికి అందరూ కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ సూచించారు. పట్టణంలోని గత కొంత కాలంగా నిలిచిపోయిన త్యాగరాజ గాన సభ నిర్మాణానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్‌లు శంకుస్థాపన చేసి కొబ్బరికాయలు కొట్టి నిర్మాణ పనులను ప్రారంభించారు. ట్రస్ట్ సెక్రటరీ తటవర్తి శ్రీనివాస్ త్యాగరాజ సభ విశిష్టతను తెలియజేశారు. ఎంపీ బోస్ త్యాగరాజ గానసభకు ఎంపీ నిధుల నుంచి రూ.20 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. అయితే నిర్మాణానికి మరిన్ని నిధులు అవసరం ఉందని వాటిని మంజూరు చేయమని మంత్రి సుభాష్‌ను కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి నిధులు విషయంలో తప్పకుండా తన వంతు సాయం చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్, ఎంపీ బోస్, జనసేన పార్టీ అధ్యక్షుడు శ్రీ పోలిశెట్టి చంద్రశేఖర్, మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, పిల్లి సూర్యప్రకాశ్‌లను ట్రస్ట్ సభ్యులు ఘనంగా సత్కరించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొవ్వూరి తాతారెడ్డి, మోడరన్ విద్యాసంస్థల అధినేత జీవీరావు, స్థానిక కౌన్సిలర్ వాడ్రేవు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నారుమడులు మునిగి రైతుల ఆందోళన



మొగలిపాలెంలో నీటమునిగిన వెదజల్లిన వరి పొలం

కాజులూరు: మండల గ్రామాల్లో జోరువాన కురిసింది. గత రెండు రోజుల నుంచి చెదురుమదురుగా వర్షం కురుస్తునే ఉంది. శనివారం ఉదయం నుంచి భారీ వర్షంపడడంతో జనజీవనం స్తంభించింది. గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు, వీధుల్లో వర్షపు నీరు చేరి జలమయమవుతుండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాకినాడ, కోటిపల్లి రహదారిలో గొల్లపాలెం చెరువుగట్టు సెంటరు వద్ద వర్షపు నీరు నిలిచి రోడ్డు మునిగిపోయి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మండల గ్రామాల్లో ప్రస్తుతం రైతులు వెదచల్లికలు, నారుమడుల చల్లిక పనుల్లో బిజీగా ఉన్నారు. అయితే ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాల వలన పల్లపు ప్రాంతాలలో నారుమడులు, వెదజల్లిన పొలాలు నీట మునిగాయి. దీంతో గింజ సరిగా మొలకెత్తక ఇబ్బందులు ఎదురవుతాయని రైతులు చెబుతున్నారు. వర్షాలు మరో రెండు రోజులు ఇదే రీతిలో కురిస్తే తమకు తీవ్ర నష్టం ఏర్పడుతుందని రైతులు వాపోతున్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

రాజోలు: ఇంటర్మీడియెట్ చదువుతున్న రాజోలుకు చెందిన జె.రోహిణికి ఏబీవీపీ విద్యార్థి సంఘ నాయకులు శనివారం రూ.8 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. పేదరికం విద్యకు అడ్డు కాకూడదనే ఉద్దేశంతో నిరుపేద విద్యార్థులను గుర్తించి ఆర్థికంగా తోడ్పాటు అందిస్తున్నామని సంఘ నాయకుడు పోలిశెట్టి గణేష్ తెలిపారు. ఆర్థికసాయం అందించిన విద్యార్థి సంఘ నాయకులను పలువురు అభినందించారు. జిల్లెళ్ల ఉదయ్, తాడి శ్రీకాంత్, మేడిచర్ల సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సీనియర్ నేత రమణ మృతి



శీలం రమణ (ఫైల్)

రామచంద్రపురం రూరల్: నెలపర్తిపాడు శివారు మామిడిగుంట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు శీలం రమణ (56) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. శీలం రమణకు భార్య విజయలక్ష్మి, కుమారుడు మనోహర్, కుమార్తె గౌతమి ఉన్నారు. రమణ మొదటి నుంచీ ఎంపీ బోస్ అనుచరుడిగా క్రియాశీలకంగా పనిచేశారు. మాజీ మంత్రి వేణు సహకారంతో గ్రామంలో రోడ్ల అభివృద్ధికి, గతంలో శ్మశానవాటికకు దారి లేక పొలాల నుంచి మృతదేహాలను తీసుకుని వెళ్లాల్సి వస్తుంటే పుంత రోడ్డు అభివృద్ధికి విశేష కృషి చేశారు. 200 గడపలు ఉన్న మామిడిగుంట గ్రామంలో ఆయన సహకారం పొందని ఇల్లు లేదంటే ప్రజాసేవపై ఆయనకు ఉన్న తపన తెలుసుకోవచ్చు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడిగా పనిచేశారు. ఆయన కరోనా సమయంలో ప్రతి ఇంటికి వెళ్లి ధైర్యం చెప్పేవారు. శాంత స్వభావిగా, అజాత శత్రువుగా గ్రామాభివృద్ధికి కృషి చేసిన శీలం రమణ మృతితో మామిడిగుంట గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. ఆయన మృతికి రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్, నాయకులు నరాల ఏడుకొండలు, కట్టా సూర్యనారాయణ, వాసంశెట్టి శ్యామ్, వాసంశెట్టి జార్జి, రాయుడు సత్యనారాయణ, గుత్తుల వీరన్నశెట్టి, నరాల సురేష్ తదితరులు సంతాపం తెలిపారు.

అధ్యాయనంతో కొత్త ఆవిష్కరణలు



గణితపోటీల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కార్యవర్గ సభ్యులు

రామచంద్రపురం: ఏకాగ్రత, శ్రద్ధతో అధ్యయనం చేయడం వల్ల విద్యార్థులు కొత్త ఆవిష్కరణలకు రూపం పొందవచ్చని రామానుజన్ గణిత అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కేవీవీ సత్యనారాయణ సూచించారు. పట్టణంలోని గణిత సేవా సంస్థ రామానుజన్ గణిత అకాడమీ ఆధ్వర్యంలో ఈ సంవత్సరం మారిన పదో తరగతి నూతన గణిత సిలబస్‌పై విశ్లేషణాత్మక కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సత్యనారాయణ మాట్లాడుతూ సిలబస్ మారడం అనేది గణిత శాస్త్ర అభివృద్ధికి ఒక చిహ్నమన్నారు. ఈ కార్యక్రమంలో ఈ ఏడాది రామానుజన్ గణిత అకాడమీ దేశవ్యాప్తంగా నిర్వహించే 35వ జాతీయ గణిత పోటీల కరపత్రాలను కార్యవర్గ సభ్యులు ఆవిష్కరించారు. గణితావధానులు, సబ్జెక్టు నిపుణులు మానేపల్లి నాగార్జున, తోట సాయి రామకృష్ణ, డాక్టర్ టీఎస్ వీఎస్ సూర్యనారాయణమూర్తి, పి.రవిశంకర్, రేవతి సైన్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు కె.కృష్ణసాయి తదితరులు ప్రసంగించారు. సుమారు 75 మంది గణిత అభిమానులు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం రోటరీ క్లబ్‌కు ఎనిమిది అవార్డులు



రోటరీ క్లబ్ పూర్వ కార్యవర్గాన్ని అభినందిస్తున్న రొటేరియన్లు

మలికిపురం: స్థానిక రోటరీ క్లబ్ సమావేశం పూలే అంబేడ్కర్ భవనంలో శనివారం జరిగింది. ఈ సమావేశంలో నూతన అధ్యక్షుడిగా రిటైర్డ్ ఎంఆర్ఓ బత్తుల ఝాన్సీ భాయ్, కార్యదర్శిగా మట్టా రవికుమార్ కోశాధికారిగా తోలేటి సతీష్ ఏన్నికైనట్టు ప్రకటించారు. గత సంవత్సరం అనేక సేవా కార్యక్రమాలు చేసినందుకు మలికిపురం రోటరీ క్లబ్‌న 8 అవార్డులు సొంతం చేసుకుందని అసిస్టెంట్ గవర్నర్ నల్లి శివకుమార్ తెలిపారు. ఈనెల 24వ తేదీన నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరగనుందని ఆయన తెలిపారు. అనంతరం పూర్వ కార్యవర్గాన్ని సన్మానించారు. కార్యక్రమంలో పాస్ట్ ప్రెసిడెంట్ సెక్రటరీ సోమిశెట్టి మురళీకృష్ణ, బందెల సంపత్‌కుమార్, గుబ్బల బాబ్జి, గెడ్డం ఫిలిప్ రాజు, రాపాక విజయరావు అల్లూరి మధురామరాజు పాల్గొన్నారు.

లభ్యంకాని మురళీకృష్ణ ఆచూకీ

ఆలమూరు: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మోతుగూడెంలో నున్న పోర్‌బై కెనాల్‌లో గల్లంతైన వీరి మురళీకృష్ణ(24) ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. దీంతో మురళీకృష్ణ స్వగ్రామమైన ఆలమూరు మండలంలోని చింతలూరులో తీవ్ర ఆందోళన నెలకొంది. స్నేహితులతో విహార యాత్రకు వెళ్లిన మురళీకృష్ణ ఈనెల 12 పుష్ప ఘాట్ బ్రిడ్జి వద్ద ప్రమాదవశాత్తు కాలు జారి కాలువలో పడిపోయాడు. అప్పటి నుంచి పోలీసులు స్థానిక జాలర్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టినా ఇంతవరకూ ఆచూకీ లభించలేదని మురళీకృష్ణ బంధువులు ఆవేదన చెందుతున్నారు. మోతుగూడెం పరిసరాల్లో భారీ వర్షాలు కురవడం వల్ల గాలింపు చర్యలకు అంతరాయం ఏర్పడినట్టు తెలుస్తోంది.

ముంపు పొలాల పరిశీలన



మంజేరులో కోరంగి కెనాల్‌ను పరిశీలిస్తున్న మంత్రి

కాజులూరు: భారీ వర్షాలకు పంటపొలాలు ముంపుబారిన పడకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. వర్షాలకు కోరంగి కెనాల్ పొంగి ముంపుబారిన పడుతున్న శీల, మంజేరు తదితర గ్రామాలలో పంటపొలాలను శనివారం ఆయన పరిశీలించారు. కెనాల్‌లో గుర్రపుడెక్క పేరుకుపోవటంతో వర్షపునీరు లాకుల నుంచి ముందుకు వెళ్ళక పొలాలు ముంపుబారిన పడుతున్నాయని రైతులు వాపోయారు. దీనిపై ఆయన స్పందిస్తూ గుర్రపుడెక్కను తొలగించాలని అధికారులను ఆదేశించారు. శీల, మంజేరు, చేదువాడ తదితర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

'శ్రేష్ట'లో సుజాతకు ఆలిండియా ర్యాంకు



ఆలమూరు: జాతీయ స్థాయి శ్రేష్ట స్కీమ్–2024 పోటీ పరీక్షల్లో సంధిపూడికి చెందిన నేల సుజాత జాస్మిన్ 310 ర్యాంక్ సాధించింది. నిరుపేదలైన చిట్టిబాబు, సునీత దంపతుల కుమార్తె సుజాత జాస్మిన్ స్థానిక ప్రైవేట్ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి పూర్తి చేసింది. అనంతరం వేసవి సెలవుల్లో సహచర విద్యార్థుల సహకారంతో శ్రేష్ట పథకానికి సంబంధించి పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసుకుంది. జాతీయస్థాయిలో ర్యాంకు సాధించింది. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో ఉన్న మోసెస్ జోసెఫ్ సికిలి స్కూల్‌లో సీటు లభించింది. ఈ శ్రేష్ట పథకం వల్ల తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సీబీఎస్ఈ సిలబస్ విధానంలో ఆగ్ల మాధ్యమంలో ఉచితంగా విద్యను అభ్యసించేందుకు వీలు కలిగింది. సుజాత జాస్మిన్‌ను ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో విద్యార్థులంతా పరిశుభ్రత పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అంబాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి కె.ఎన్.శ్రీనివాస్ అన్నారు. గంగలకుర్రులో ఉన్న ఇంటిగ్రేటెడ్ వసతి గృహంలోని విద్యార్థులకు సీహెచ్ఓ బి.అప్పారావు అధ్యక్షతన శనివారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ అంటు వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ నెల 18 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు లెప్రసీపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నామన్నారు. వంటచేసే ప్రాంతాన్ని, వంట గిన్నెలు పరిశుభ్రంగా ఉంచాలని వార్డెన్‌కు సూచించారు.

కుక్కలున్నాయ్.. పిక్కలు జాగ్రత్త

- విస్తృతంగా పెరిగిన శునకాల సంతతి
- పెరుగుతున్న కుక్క కాటు బాధితులు
- కానరాని కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు



కె.గంగవరం మండలం పామర్రులో రోడ్డుపై గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

కె.గంగవరం: సాయంత్రమైతే చాలు కుటుంబంతో రోడ్డెక్కుతాయి. కూడళ్లలో సతీసమేతంగా విశ్రాంతి తీసుకుంటాయి. కనిపిస్తే కండ పీకుతాయి. పరుగులు తీయిస్తాయి. పట్టణాల నుంచి గ్రామీణ ప్రాంత పల్లెల వరకు శునకాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. పట్టణంలోని మున్సిపాలిటీతో పాటు గ్రామ పంచాయతీల వరకు నిధులు ఉన్నా శునకాల నియంత్రణ కాగితాలకే పరిమితమైంది. రామచంద్రపురం పట్టణంతో పాటు కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం రూరల్ గ్రామాల్లో కుక్కలు బీభత్సం సృష్టిస్తున్నాయి. రోజున సగటు ఒకరిద్దరు కుక్కకాటుకు గురవుతున్నారు. వాహన చోదకులు కుక్కల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రి పాలవుతున్న సంఘటనలు కనిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్న శునకాల నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించడంపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కె.గంగవరం మండలంలో 2000, కాజులూరు మండలంలో 2300, రామచంద్రపురం రూరల్ 1800 వరకు సుమారుగా కుక్కలు ఉన్నట్లు అంచనా. గ్రామాల్లోని మాంసం విక్రయ కేంద్రాల వద్ద వ్యర్థపదార్థాలు తింటూ మనుషులు, పశువులపై దాడులు చేస్తున్నాయని స్థానికులు అంటున్నారు.

ప్రథమ చికిత్స ఇలా..

కుక్క కాటుకు గురైతే గాయాన్ని సబ్బు, నీటితో బాగా కడగాలి. గాయాల్ని కప్పకూడదు, దగ్గర్లోని డాక్టర్‌ని సంప్రదించాలి. రేబిస్ వ్యాధితో చనిపోయిన జంతువులను కాల్చడం లేదా సున్నపు గుంటలో పూడ్చడం చేయాలి. కుక్క ఉండే పరిసరాలు, అవి తిరిగే ప్రదేశాలు, పాత్రలను క్రిమిసంహారక మందులతో తరుచూ శుభ్రపరుచుకోవాలి. ఈ వ్యాధికి చికిత్స లేదు. పెంపుడు కుక్కలను పశువైద్యుడితో రేబిస్ టీకా వేయించాలి. ఊరకుక్కలకు కూడా ఈ వ్యాధి రాకుండా పంచాయతీల సహాయంతో టీకాలు వేయించాలి.

రేబిస్ కుక్కల లక్షణాలివీ..

రేబిస్ లక్షణాలున్న కుక్కల నోటి నుంచి చొంగ కారుతుంది. నాలుక బయటపెట్టి మతి లేకుండా తిరుగుతాయి. కనిపించిన వారిని, పశువులను, ఇతర కుక్కలను కరుస్తాయి. అరుపులో మార్పు వస్తుంది. ఇవి 7 నుంచి 10 రోజుల్లో చనిపోతాయి. ఈ జబ్బు వచ్చిన మరికొన్ని కుక్కలు తినకపోవడం, నిశ్చలంగా ఒకచోటే పడుకుని అలాగే ఉండిపోతాయి. పక్షవాతం రావడం తదితర లక్షణాలతో రెండు మూడు రోజుల్లో చనిపోతాయి. దీన్ని మూగ రేబిస్ అంటారు. రేబిస్ కుక్క కరిస్తే వ్యాధి నిరోధిక టీకాలు వేయించడం తప్పనిసరి.

ప్రత్యేక నిధులు లేవు

కుక్కలను పట్టేందుకు పంచాయితీలకు ప్రత్యేక నిధులు లేవు. వాటిని సంహరించే అధికారం లేదు. పిచ్చికుక్కలను గ్రామస్తులే సంహరిస్తున్నారు. కుక్కలు ఎక్కువగా మాంసం విక్రయ కేంద్రాల వద్దే సంచరిస్తున్నాయి. మాసం వ్యర్థాలను ఊరికి దూరంగా పాడేయాలని వారికి సూచించాం.

– నాగేంద్ర, ఈవోపీఆర్డీ, కె.గంగవరం

దినదిన గండం

గుంపులు గుంపులుగా కుక్కలు వీధుల్లో స్వైర విహారం చేస్తూ భయభ్రాంతుల్ని చేస్తున్నాయి. ఎప్పుడు ఏ వైపు నుంచి వచ్చి ఎవరి మీద దాడి చేస్తాయో తెలియడం లేదు. ఇది వరకే ఎంతో మందిపై దాడి చేసి గాయపరిచాయి. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందించడం లేదు.

– నరాల శ్రీను, భట్లపాలిక